# ప్రైవేటు ప్రాక్టీసు

డాక్టర్. టి. చంద్రశేఖరరావు

హఠాత్తుగా ఎవరో మంత్రిగారు చచ్చిపోయారని ఆరోజు ఆస్పత్రిక్కూడా సెలవిచ్చారు.

బద్ధకించడానికి అంతకంటే అవకాశం రాదని, గెడ్డం గీసుకోకుండా, స్నానం కూడా చెయ్యకుండా ఇంట్లోనే వుండిపోయారు డాక్టర్ చిన్నారావుగారు. దేశం అంతా ఆరోగ్యంగా వుంటేనో, మంత్రులు చచ్చిపోతేనోతప్ప డాక్టర్లు అలా హాయిగా బద్ధకించే అవకాశం రాదు. అవకాశం రాగానే సరిపోదు. బద్ధకించే అదృష్టం కూడా వుండాలి.

ఇంతలో కాలింగ్‌బెల్ మోగింది. డాక్టర్‌గారు వెళ్ళి తలుపు తీసేసరికి ఎదురుగా పాతికేళ్ళ స్త్రీ ఆదుర్దాగా నిలబడి వుంది. అందంగా, నాజూగ్గా, నాగరికంగా చదువు, సంస్కారం వున్న పెద్ద కుటుంబంనుండి వచ్చిన స్త్రీలాగ వుంది.

"గుడ్‌మార్నింగ్ అంకుల్" అంది. ఆవిడ 'అంకుల్' అనేసరికి తనని ముసలాడికింద జమ కట్టేసిందని ఆయనకి మొదట బాధవేసింది. లేకపోతే తదేకంగా ఆవిడ్ని చూస్తూ నిలబడి పోయినందుకు ఆయన శీలాన్ని శంకించి ఎందుకైనా మంచిదని ముందు జాగ్రత్తగా 'అంకుల్' అనేసిందేమోనని తననితానే సముదాయించుకున్నారు డాక్టర్ చిన్నారావుగారు.

"ఎవరు కావాలి?" అనడిగారు.

"మీరే కావాలి. మీకోసమే వచ్చాను. లోపలికి రావచ్చా" అని అంత ఆదుర్దాలోనూ తియ్యగా అడిగింది.

"ప్లీజ్ కమిన్" అన్నాడు. ఆమె లోపలికి వచ్చింది.

"కూర్చోండి" అన్నారు. కూర్చుంది.

"అంకుల్ అని చనువు తీసుకుని పిల్చినందుకు క్షమించండి డాక్టర్. నా పేరు సుజాత. పెళ్ళయ్యింది. ఇద్దరు పిల్లలుకూడా. ఆస్తి బాగానే వుంది. మా ఆయనకి పెద్ద వుద్యోగంకూడా వుంది. మాకు ఏ లోటూలేదు" అని వివరించి కొంచెం ఆగి "అయినా మీ దగ్గరికి ఎందుకొచ్చానా అని ఆలోచిస్తున్నారా?" అంది.

"అన్నీవున్నా ఆరోగ్యం బాగులేదని వచ్చారా?" అనడిగారు డాక్టర్‌గారు.

"నా ఆరోగ్యం బాగానేవుంది. మానసికంగా ఆయన అదోరకంగా తయారయ్యారు. మీరు కళ్ళ డాక్టరేనని నాకు తెలుసు. అయినా మీకు ఓపిక ఎక్కువని విని నమ్మి, మిమ్మల్నే వెదుక్కుంటూ వచ్చాను" అందామె.

"ఆకలీ, నిద్రా సరిగ్గా వున్నాయా ఆయనకి?" అనడిగారు డాక్టర్ చిన్నారావుగారు.

"సుష్టుగా భోంచేస్తున్నారు. హాయిగా నిద్రపోతున్నారు. మతి స్థిమితం తప్పిందని అనుమానం లేదు. అలాగైతే ఏ



పిచ్చి డాక్టర్ దగ్గరకో తీసుకెళ్ళేదాన్ని. ఆయనకి మనసులో ఏదో అనుమానం పట్టుకుని వేధిస్తోందని నా అనుమానం" అని చెమర్చిన కళ్ళు తుడుచుకుంది.

"భార్యా రూపవతి శత్రుహి అన్నారు. ఆయనకి మీమీద అనుమానమా?" అనడిగారు.

"మేం ప్రేమించుకుని పెళ్ళి చేసుకున్నాం. నామీద ఆయనకి ఎటువంటి అనుమానం లేదు" అంది.

"మరి వుద్యోగంలో ఏదైనా అసంతృప్తి, చికాకులు వున్నాయా?" అనడిగారు.

"ఎన్నిసార్లు అడిగినా ఆ సంగతి చెప్పడంలేదు. మూడు నెలలనుండి ఆఫీసుకి సెలవు పెట్టేసారు. జీతం రాకపోయినా ఫర్వాలేదు. ఆయన కులాసాగా వుంటే అంతేచాలు. మీరే నా సంసారం నిలబెట్టాలి. ఆయన్ను మామూలు మనిషిని చెయ్యాలి" అని అమాంతంగా వచ్చి డాక్టర్‌గారి కాళ్ళు పట్టుకుంది. సినిమాలోలాగ ఆవిడ్ని భుజాలు పట్టుకుని పైకి లేవదీసి కన్నీళ్ళు తుడిచి తలమీద బుజ్జగించి అభయం ఇవ్వడానికి ఆయనకి ధైర్యం చాలలేదు. లోపలున్న వాళ్ళావిడ వచ్చి చూసిందంటే ఏమనుకుంటుందో? నా సంసారం నిలబెట్టండంటూ ఈవిడ మీ కాళ్ళమీద ఎందుకు పడిందని వాళ్ళావిడ ఆయన్ని నిలదీస్తే ఏంచెప్పాలో తెలియక ఖంగారు పడ్డారు. గుండెల్లో భయం బయల్దేరి కాళ్ళు వణికాయి డాక్టర్‌గారికి. ఆయన కాళ్ళు వణక్కుండా ఆవిడ ఇంకా గట్టిగా పట్టుకుంది.

"నాకు చేతనైన సాయం నేనుచేస్తాను. దయచేసి మీరు లేవండి" అని ధైర్యం చేసి అనగల్గారు. ఆవిడ దయదల్చి కాళ్ళు వదిలేసి నెమ్మదిగా ఆవిడ అంతట ఆవిడే లేచింది.

లేవకపోతే ఆయనే తిరిగి ఆవిడకాళ్ళ మీదపడి 'నా సంసారం నిలబెట్టమని' అడగాల్సి వచ్చేది. అటువంటి ప్రమాదం తప్పిందని సంతోషించారు.

ఆవిడ అలా దుఃఖిస్తూంటే ఆయన సంతోషించడం బా వుండదని "నేను ప్రైవేటు ప్రాక్టీసు చెయ్యకూడదు. అయినా తెగించి నీ మీద జాలికొద్దీ మీ ఆయనకి వైద్యం చేస్తాను. ఇంతకీ మీ ఆయన ఏడీ? ఎక్కడున్నాడు?" అనడిగారు.

"నాతో పాటే తీసుకువద్దామనుకున్నాను. కానీ ఆయన బయటకురారు. తానొక బంగారం షాపులో గుమస్తాగా పనిచేస్తున్నట్టు వూహించుకుని అస్తమానం నగలో, బంగారం, ముత్యాలో, పగడాలో, పచ్చలో, వజ్రాలో, డబ్బు, బిల్లు కట్టేసే టైము, తలుపులు తాళాలు అంటూ ఏమిటేమిటో మాట్లాడుతారు. చూడ్డానికి కూడా గుమాస్తాలా తయారయ్యారు. మధ్య మధ్యలో గుమాస్తాలా వినయంగా చిర్నవ్వు నవ్వుతారు. జాక్సన్ అండ్ జాక్సన్ కంపెనీలో ఏరియా మేనేజర్‌గా వుండే ఆయన్ని ఇలా చూస్తే నా కడుపు తరుక్కుపోతోంది."

"ఆయన రాలేకపోతే నేనైనా మీ ఇంటికి వచ్చి ఆయన్ని చూడాలి" అన్నారు డాక్టర్ చిన్నారావుగారు.


"మీకెందుకా శ్రమ? నేనే ఏదో చెప్పి ఆయన్ని నమ్మించి తీసుకువస్తాను. ముందు మీరేం మాట్లాడకండి. ఆయన్ని కూర్చోనిచ్చి ఏంచేస్తారో గమనించండి. చివరికి ఆయనే మాట్లాడ్డం మొదలు పెడతారు. ప్రస్తుతానికి ఇది వుంచండి. ఆయనకి పూర్తిగా నయమయ్యాక మీ ఋణం వుంచుకోను" అని ఆమె ఐదొందలు తీసి బల్లమీద వుంచారు.

"ముందు ఆయన్ని తీసుకురండి. నేనేమైనా చెయ్యగలిగితే చూస్తాను. ఆ తర్వాత ఇద్దురుగాని" అని డబ్బు తీసుకోలేదు డాక్టర్‌గారు.

ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. డబ్బు తీసుకోకుండా వైద్యం చేస్తే జబ్బు తగ్గదని ఆమె అనుమానం కాబోలు. మళ్ళీ కాళ్ళమీద పడుతుందేమోనని భయపడ్డారు చిన్నారావుగారు.

"చూడమ్మా! నువ్వు రాగానే అంకుల్ అని ఆప్యాయంగా పిలిచావు. నీ దగ్గర డబ్బు తీసుకోను. అదీకాక ఈమధ్య డాక్టర్ల ప్రైవేటు ప్రాక్టీసు బాన్ చేశారు కూడా! డబ్బు తీసుకుంటే వుద్యోగం పోతుంది. అంకుల్ అని పిల్చాక నీదగ్గర డబ్బు తీసుకుంటే కళ్ళుకూడా పోతాయి. అసలే కళ్ళడాక్టర్ని. నువ్వు అస్తమానం కళ్ళనీళ్ళు పెట్టుకోకు. ధైర్యంగా వుండాలి. మీ ఆయన్ని మామూలు మనిషిని చేసి నీ సంసారం నిలబెడతాను. నువ్వెళ్ళి మీ ఆయన్ని తీసుకురా" అన్నారు డాక్టర్‌గారు వాత్సల్యంతో.

"థ్యాంక్యూ అంకుల్! చిన్న రిక్వెస్ట్ మా ఆయన ఆటో రిక్షాలు, టేక్సీలు ఎక్కరు. ఏదో అనుమానం. మూడ్నెల్లబట్టి ఆఫీసుకారు డ్రైవరు లేడు. మాకారు డ్రైవ్ చెయ్యడానికి నాకు భయం. ఆయనే






డ్రైవ్ చెయ్యడం మంచిదికాదు. అందు కని..." అని మొహమాట పడింది సరోజ.

"అందుకని నా కారు పట్టుకెళ్ళు. మా డ్రైవర్ వుంటాడు. బంగారం షాపుకే వెళ్దాం అని మీ ఆయనకి చెప్పు. తిన్నగా ఇక్కడికి తీసుకురా. మిగిలినది నేను చూసుకుంటా" అని డాక్టర్‌గారు డ్రైవర్ని పిలిచి కారులో సరోజని పంపించారు.

కారులో సరోజ తిన్నగా బంగారం షాపుకి వెళ్ళింది. డాక్టర్‌గారు, ఆయన కారు, ఆయనుడ్రైవర్ బంగారం షాపు వాళ్ళకి బాగాతెలుసు.

"నేను డాక్టర్‌గారి మేనకోడల్ని. మా చెల్లి పెళ్ళికి నగలు కావాలి. ఈ మూడు రకాలు నెక్లెస్‌లు, దుద్దులు, గాజులు. మీ నమ్మకమైన గుమాస్తాతో పంపించండి. నచ్చినవి తీసుకుని బిల్లు గుమస్తాతో పంపిస్తాను" అంది సరోజ.

మూడు సెట్లు నగలు నమ్మకమైన గుమాస్తాతో డాక్టర్‌గారి కారులో సరోజతో పంపించారు బంగారం కొట్టువాళ్ళు.

కారు తిన్నగా డాక్టర్‌గారింటికి వచ్చింది.

"మీరు డాక్టర్‌గారి దగ్గర కూర్చోండి నేను అత్తయ్యకినగలు చూపించి, నచ్చిన వాటికి డబ్బులిచ్చి మీ బిల్లు సెటిల్ చేస్తాను రండి" అని సరోజ గుమాస్తాని తీసుకొచ్చి డాక్టర్‌గారి దగ్గర కూర్చోపెట్టి, "నేను ఆంటీ దగ్గర వుంటాను. నేను చెప్పిన బంగారం కొట్టు గుమాస్తా ఆయనే అంకుల్! చూసుకోండి" అని లోపలికి వెళ్ళింది సరోజ. నగలతో లోపలికి వెళ్ళిన సరోజ నగలతో సహా మరో గుమ్మంలోంచి వీధిలోకి వెళ్ళిపోయింది చల్లగా. ఎదురుగా కూర్చున్న గుమాస్తా కేసి పరీక్షగా చూసారు డాక్టర్‌గారు. గుమస్తా వినయంగా చిర్నవ్వు నవ్వాడు. ఆవిడ చెప్పింది జ్ఞాపకం వచ్చిడాక్టర్‌గారు చిర్నవ్వు నవ్వుకున్నారు.

"మీరు ....?" అనడిగారు డాక్టర్‌గారు.

"నేను బంగారం కొట్టు గుమాస్తాని" అన్నాడు వినయంగా గుమాస్తాగారు.

డాక్టర్‌గార్కి నవ్వొచ్చింది. జాక్‌సన్ అండ్ జాక్‌సన్ కంపెనీ ఏరియా మేనేజర్‌కి ఏంగతి పట్టింది అని జాలిపడ్డారు.

"అమ్మాయి చెప్పింది మీ సంగతి. సరోజ లోపల్నించి వచ్చేదాకా కాస్సేపు కూర్చోండి" అని డాక్టర్‌గారు పేపరు అడ్డుపెట్టుకుని అతడ్ని పరిశీలించసాగారు.


అతను ఏదో లెఖ్ఖలు నోటితో చేసుకుని కాగితంపై వేసుకున్నాడు. జేబులో తాళాలు బయటికి తీసి చూసుకుని మళ్ళీ జేబులో వేసుకుని మళ్ళి నోటితో లెఖ్ఖలు వేసుకున్నాడు. డాక్టర్‌గారికేసి మళ్ళీ వినయంగా చిర్నవ్వు నవ్వాడు. వాచీకేసి చూసుకుని ఆలస్యం అయిపోతున్నట్టు ముఖం పెట్టాడు.

"టైం అయిపోయిందా ?" అనడిగారు డాక్టర్‌గారు.

"అదే కొట్టు తాళాలు నా దగ్గర వున్నాయి. తలుపులు వెయ్యాలంటే..." అని వినయంగా నసిగాడు.

"ఏంకొట్టు" అనడిగాడు చిన్నారావు గారు.

"భలేవారేసార్ ! తెలియనట్టు అడుగు




తారు. బంగారం కొట్టు" అన్నాడు గుమాస్తా.

"నాకు తెలుసు! బంగారం కొట్టు, తాళాలు, తలుపులు, పగడాలు, ముత్యాలు, పచ్చలు, వజ్రాలు అన్నీ అమ్మాయి చెప్పింది. తొందరపడకు. కొంచెంసేపు ఓపిక పడితే ఇంటికి పంపించేస్తాను" అన్నారు డాక్టరుగారు ఆప్యాయంగా నవ్వుతూ.

"ఇంటికేమిటి సార్ ? షాపుకి వెళ్ళాలి. అవే ఆ నగల బిల్లు ఆ డబ్బు ఇచ్చేస్తే" అని వినయంగా నసిగి చిర్నవ్వు నవ్వాడు.

"నగలు, బిల్లు అంటూ బెంగ పెట్టుకోకు. నగలేమిటి ? బిల్లేమిటి ? అలాంటి ఆలోచనలు పెట్టుకోకు" అన్నారు డాక్టర్‌గారు.

"పెద్దవారు ! నాతో పరాచికాలాడకండి. ఆ నగలు, డబ్బు ఇచ్చి నన్ను పంపించండి. కొట్టు కట్టేసే టైమైంది" అని ప్రాధేయపడ్డాడు గుమాస్తా.

"అనవసరంగా అల్లరి చెయ్యకు. నగలు, డబ్బు నీ వూహ! అసలు బంగారం కొట్టెక్కడుంది ? నగలేమిటి ? బిల్లేమిటి? డబ్బేమిటి ? నీవసలు ఏం మాట్లాడుతున్నావో తెలుసా ?" అని డాక్టర్‌గారు కోప్పడ్డారు.

"బాబూ ! నా సంసారం నిలబెట్టండి. నేను గుమాస్తాగాడ్ని. ఆ నగలు, డబ్బు తీసుకెళ్ళకపోతే మా షావుకారు జైలుకి పంపించేస్తాడు. నన్ను రక్షించండి బాబూ !" అని డాక్టర్‌గారి కాళ్ళమీద పడ్డాడు.

"సరోజా ! సరోజా !" అని పిల్చారు డాక్టరుగారూ. ఎన్నిసార్లు పిల్చినా సరోజ రాలేదు. డాక్టర్‌గారిభార్య మాత్రం వచ్చి "సరోజ ఎవరండీ మనింట్లో ? నాపేరు గాయత్రి. పెళ్ళాంపేరే మర్చిపోయారా?" అంది.

"సరోజ లోపలికి రాలేదా ? అనడిగారు డాక్టర్‌గారు ఏం జరిగిందో తెలియక అయోమయంగా.

"సరోజ ఎవరండి మధ్యలో" అని రాగాలు పెట్టసాగింది గాయత్రిగారు.

"బాబూ! నానగలు డబ్బు" అంటూ కాళ్ళమీద పడ్డాడు గుమాస్తా.

సరోజ ఏమయ్యిందో డాక్టర్‌గార్కి తెలియలేదు. మరి డాక్టర్‌గారి ప్రైవేట్ ప్రాక్టీస్ ఏమయ్యిందో నాకు తెలియలేదు.